ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరవు

- నిర్లక్ష్యంగా వదిలేసిన జీవీఎంసీ యంత్రాంగం


25వ వార్డు రాజేంద్రనగర్‌లో పిచ్చి మొక్కలతో కళావిహీనంగా పార్కు స్థలం


జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మ వీధిలోని ప్రభుత్వ స్థలంలో చెత్త, పిచ్చిమొక్కలు


26వ వార్డు శాంతిపురంలో పద్మశ్రీ ఆస్పత్రి ఎదురుగా రక్షణ లేని ప్రభుత్వ స్థలం

సీతంపేట : ఉత్తర నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. నగరంలో స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో... విలువైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన జీవీఎంసీ యంత్రాంగం గాలికి వదిలేసింది. కోట్ల రూపాయల విలువైన స్థలాలను పరిరక్షించకపోవడంతో ఆక్రమణదారులు కబ్జాలకు పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల యంత్రాంగం నిర్లక్ష్యంతో పిచ్చి మొక్కలు పెరిగి, చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. దీంతో చుట్టు పక్కల నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేలా ఫెన్సింగ్, ప్రభుత్వ స్థలమని గుర్తించేలా బోర్డులు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫెన్సింగ్‌లు మాయమయ్యాయి. కనీసం ఖాళీ స్థలాలను పరిరక్షించి, ప్రజోపయోగార్థం వినియోగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురంలో పద్మశ్రీ ఆస్పత్రి వద్ద 120 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.2 కోట్లు. ఇంత విలువైన స్థలాన్ని జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో ఒక వ్యక్తి ఆవులు కట్టే నెపంతో స్థలాన్ని ఆక్రమించి నాలుగేళ్లపాటు తన అధీనంలో ఉంచుకుని షెడ్డు నిర్మించసాగాడు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి కంచె వేశారు. ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. కొద్ది నెలల కిందట కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కంచె ధ్వంసమైంది. బోర్డు మాయమైంది. దీంతో ఆక్రమణకు మార్గం తెరిచినట్టయిందని స్థానికులు అంటున్నారు.
- జీవీఎంసీ 25వ వార్డు పరిధి శాంతిపురం శంకర మఠం మెయిన్ రోడ్‌లో వాంబే స్కీం ఇళ్లకు అనుకుని వంద గజాల ప్రభుత్వ స్థలం ఉంది. సుమారు కోటిన్నర విలువైన స్థలాన్ని జీవీఎంసీ గాలికి వదిలేసింది. కనీసం ఈ స్థలంలో ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డుగానీ, చుట్టూ కంచెగానీ, ప్రహరీ గానీ ఏర్పాటు చేయలేదు.
- జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో సాయికుటీర్ ఎదురుగా సుమారు 600 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. దీన్ని కాలనీకి చెందిన ఓపెన్ స్పేస్‌గా విడిచిపెట్టారు. ఈ స్థల పరిరక్షణకు జీవీఎంసీ చర్యలు చేపట్టకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కొంత స్థలాన్ని ఆక్రమించి షెడ్డు, బాత్‌రూమ్‌లు నిర్మించి సొంతానికి వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేసినా జీవీఎంసీ యంత్రాంగం ఇప్పటి వరకు రక్షణ చర్యలు చేపట్టలేదు. అక్కడ మిగిలిన స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు, పాములకు ఆవాసంగా మారింది.
- జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రాజేంద్రనగర్‌లో సుమారు రెండు వేల గజాలలో రాజేంద్రనగర్ పార్కు ఉండేది. ఏళ్ల తరబడి నిర్వహణ లేక పార్కు డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం సామాజిక భవనం, కల్యాణ మండపం, ఆస్పత్రి, రైతుబజార్‌లలో ఏదో ఒకటి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.
- జీవీఎంసీ 25వ వార్డులో కనకమ్మవారి వీధిలో సుమారు రెండు వేల గజాల ఖాళీ స్థలం ఉంది. ఎన్నో సంవత్సరాల నుంచి దీనిని ఎవరూ పట్టించుకోలేదు. గతంలో కొంతమంది ఈ స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించే యత్నం చేశారు. స్థానికుల ఫిర్యాదులతో ఆ స్థలంలో ప్రభుత్వానికి చెందిన స్థలమని, ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అర్బన్ ఎమ్మార్వో ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో సామాజిక భవనం, కల్యాణ మండపం, పార్కుగానీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ యంత్రాంగం ప్రభుత్వ స్థలాలపై సర్వే నిర్వహించి రక్షణ చర్యలు చేపట్టి పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.


25వ వార్డు శంకరమఠం రోడ్‌లో అధ్వాన స్థితిలో ప్రభుత్వ స్థలం

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



నగరంలో స్థలాలకు బాగా ధరలు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా ప్రహరీలు నిర్మించాలి. ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకుని ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఖాళీ స్థలాలను అక్కడి ప్రజల అవసరాలకు తగినట్టు సామాజిక భవనాలు, పార్కులు, కల్యాణ మండపాలు నిర్మించి వినియోగంలోకి తేవాలి.

– దండా ఈశ్వరరావు, సీతంపేట

అధికారులు దృష్టి సారించాలి



ఎంతో విలువైన ప్రభుత్వ స్థలాలను ఖాళీగా వదిలేయడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. చాలా భయంగా గడుపుతున్నాం. కొంత మంది ఖాళీ స్థలాల్లో చెత్త పడేస్తున్నారు. సీతంపేట, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో చాలా ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టి సారించి ప్రజల అవసరాలకు తగినట్టు అభివృద్ధి చేయాలి.

– పి.ఆదిలక్ష్మి, అక్కయ్యపాలెం

ప్యాచ్ వర్కుల్లోనూ నాణ్యతకు తిలోదకాలు


డాక్టర్స్ కాలనీలో మరమ్మతులు చేసినచోట గోతులు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలోని పలు ప్రాంతాల్లో చేస్తున్న ప్యాచ్ వర్కుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నగరంలో నిర్మించే రోడ్లలో నాణ్యత ఉండడం లేదు. వర్షాలు కురిస్తే గోతులమయమవుతున్నాయి. అలా గోతులమయమై అధ్వానంగా తయారైన రోడ్లకు చేపట్టిన ప్యాచ్ వర్కుల్లోనూ నాణ్యత పాటించకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్యాచ్‌వర్కులు చేపట్టిన చోట గోతులమయం కావడమే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. సీతమ్మధార డాక్టర్స్ కాలనీ, టీపీటీ కాలనీ ప్రాంతాల్లో గతుకుల రోడ్లకు ఇటీవల ప్యాచ్ వర్కులు చేశారు. పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో అప్పుడే గోతులమయమయ్యాయి. అధికారులు మామూళ్ల మత్తులో జోగడం వల్లే నాణ్యతకు కాంట్రాక్టర్లు తిలోదకాలు ఇచ్చేస్తున్నారని అందరూ విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై గోతులు పూడ్చాలని, పనులను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.


టీపీటీ కాలనీలో రోడ్డుపై గోతులు

క్లుప్తంగా

క్రైం ఎస్‌ఐ భాస్కరరావు బదిలీ


ఎస్‌ఐ భాస్కరరావు

సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రైం ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.భాస్కరరావు పీఎం పాలెం స్టేషన్‌కి బదిలీ అయ్యారు. ఆయన ఈ ఏడాది జనవరిలో ఇక్కడ క్రైం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి నేటి వరకు 18 కీలకమైన కేసుల్లో పురుగోతి సాధించడం విశేషం. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు చేసిన ఒక ఢిల్లీ గ్యాంగు, ఒక ముంబయి గ్యాంగు సభ్యుల అరెస్టులో భాస్కరరావు కీలక పాత్ర పోషించి, చోరీ సొత్తు రికవరీ చేశారు. స్టేషన్ పరిధిలో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంలో ఆయన సఫలీకృతమయ్యారు. బుధవారం పీఎం పాలెం శాంతి భద్రతల విభాగం ఎస్‌ఐగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సీతమ్మధార : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టు ఆస్పత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడడం గమనించిన స్థానికులు ఈ నెల ఒకటిన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుని వివరాలు తెలియలేదు. యాచకుడని పోలీసులు భావిస్తున్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

త్రిముఖ ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లో గల త్రిముఖ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతికి 108 కళశాలతో కళశ పూజ చేశారు. ఉదయం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద గురునాథ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కల్యాణం మంగళవారం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నల్లమిల్లి వెంకటరెడ్డి, శాంతి దంపతులు, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, బి.కె.నాయుడు, శంకరనాయుడు, సత్యనారాయణ, వెంకటలక్ష్మి, శైలుకుమారి, శ్రీదేవి, కోటేశ్వరమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం


హోమం నిర్వహిస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గాంధీ నగర్ సత్యం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాల్లో భాగంగా సోమవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఆర్గనైజర్ కోన గోవిందరావు ఆధ్వర్యంలో ఇక్కడ పూజలు చేశారు. ఉత్సవాలు 22న కలశ ఉద్వాసనతో పూర్తవుతాయన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 17న లక్ష్మీ గణపతి హోమం, 18న విజయ గణపతి హోమం, 19న చండీ హోమం, 20న కుంకుమార్చన, 21న పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. 18న భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తామన్నారు. విగ్రహ దాత సంపంగి శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

25వ వార్డులో పడకేసిన పారిశుధ్యం


సీతంపేట రెల్లి వీధి రోడ్‌లో పేరుకుపోయిన చెత్త


సీతంపేట రెల్లివీధిలో ఒక అపార్టుమెంట్ ముందున్న చెత్త

సీతంపేట : అధికారుల పర్యవేక్షణ లోపంతో వార్డుల్లో పారిశుధ్యం నిర్వహణ గాడి తప్పింది. జీవీఎంసీ 25వ వార్డులో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వీధుల్లో చెత్త కుప్పలు రోత పుట్టిస్తున్నాయి. కనకమ్మ ఆలయం నుంచి రెల్లి వీధికి వెళ్లే మార్గంలో చెత్త, వ్యర్థాలు డంపర్‌బిన్ చుట్టూ చెల్లాచెదురుగా పోగుపడి అటుగా వెళ్లే వారికి రోత పుట్టిస్తున్నాయి. ఇక్కడ డంపర్ బిన్‌ను రోడ్ మధ్యలో పెట్టడంతో రోడ్డు నిండా చెత్త పేరుకుపోయింది. ప్రతీ సచివాలయానికి శానిటేషన్ సెక్రటరీ, వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు ఉన్నా పారిశుధ్యం మాత్రం అధ్వానంగా తయారవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు యథావిధిగా రైతుబజార్


సీతమ్మధార రైతుబజార్‌లో వినియోగదారుల రద్దీ

సీతమ్మధార : స్థానిక రైతుబజార్ మంగళవారం యథావిధిగా పనిచేయనుంది. రైతుబజార్లకు 2020 సంవత్సరం నుంచి అమలు చేస్తున్న వారాంతపు మంగళవారం సెలవుని జిల్లా యంత్రాంగం రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రతీ మంగళవారం సెలవు దినంగా పాటించడంతో రైతులు, సిబ్బంది, వ్యాపారులు సొంత పనులు చేసుకునేవారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సెలవు రద్దు చేయడం, రైతుబజార్‌కి చెందిన రైతులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుని కలిసి సెలవు కొనసాగించాలని కోరుతూ వినతిపత్రం అందజేయడం తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యాసిన్ ‘సాక్షి’తో మాట్లాడుతూ సీతమ్మధార రైతుబజార్ మంగళవారం యథావిధిగా పని చేస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు ఇదే విషయాన్ని ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ మైకు ద్వారా సోమవారం ప్రకటించారు. అయితే రైతుబజార్‌కు మంగళవారం సెలవు అన్న ఉద్దేశంతో సోమవారం అధిక సంఖ్యలో వినియోగదారులు తరలిరావడంతో రద్దీగా కనిపించింది. రైతుబజార్‌లో మంగళవారం వినియోగదారుల స్పందన ఆధారంగా సెలవు కొనసాగించాలా..? రద్దు చేయాలా..? అన్నది నిర్ణయిస్తారని సమాచారం.

పోర్టు ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దు

- సిటు నేతల డిమాండ్
- 19న నల్లబ్యాడ్జీలతో నిరసన
- 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా
- అక్టోబర్ 1 నుంచి రిలే నిరాహార దీక్షలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దని, పోర్టు సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సిటు డిమాండ్ చేసింది. విశాఖ పోర్టు ఆస్పత్రిని పీపీపీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ నిరసనకు సంబంధించిన పోస్టర్‌ను యూనియన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బి.జగన్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రిని సాలిగ్రామపురంలో 1984లో 150 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగా నడుస్తోందన్నారు. పోర్టు అండ్ డాక్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, రిటైర్ అయిన కార్మికులు, ఫ్యామిలీ పెన్షనర్లు, పూల్ కలాశీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులతో పాటు సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు 35 వేల కుటుంబాలకు దశాబ్దాల తరబడి సేవలందిస్తుందన్నారు. అటువంటి పోర్టు ఆస్పత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిగా 300 పడకలతో ప్రైవేట్ వారికి ఇచ్చేయాలనే నిర్ణయం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాన్ని సిటు వ్యతిరేకిస్తుందన్నారు. పోర్టులో పీపీపీ/ఓటీటీ విధానాలు విఫలమయ్యాయని, గతంలో స్వయంగా కాగ్ మొట్టికాయలు వేసిన సంగతిని గుర్తు చేశారు. పీపీపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేపడుతున్నామని, దీనిలో భాగంగా 19న నల్లబ్యాడ్జీలతో నిరసన, 24న ఏవోబీ వద్ద ఒక రోజు ధర్నా, అక్టోబర్ 1 నుంచి పోర్టు ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వి.రామలింగేశ్వరరావు, జక్కన్న సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


పసుపురెడ్డి నళిని

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. బర్మాక్యాంప్ శ్రీనివాసనగర్‌లో తల్లిదండ్రులతో కలిసి పుసుపురెడ్డి నళిని (22) నివసిస్తుండేది. ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్న ఆమె ఈ నెల 14న సాయంత్రం నుంచి కనిపించడం లేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పి.అన్నాజీరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

గణేష్‌నగర్‌లో అన్నసమారాధన


గణేష్‌నగర్‌లో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట : గణేష్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో సీతంపేట గణేష్‌నగర్ రోడ్‌లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహా అన్న సమారాధన నిర్వహించారు. యూత్ ప్రతినిధి ఉప్పాడ సన్నీ ఆధ్వర్యంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ముందుగా వినాయకునికి పూజలు చేశారు.

కొలనులో గణేశుడి నిమజ్జనం


నిమజ్జనంలో గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గణపతికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి చిన్నారులు తయారు చేసిన కొలనులో సాయంత్రం గణపతిని నిమజ్జనం చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతులు శ్రావణి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నమ్మి జశ్వంత్, మాన్విత, సీహెచ్ జశ్వంత్, ఎం.జశ్వంత్, జగదీష్, వెంకటీ, కె.నిఖిల, వై. దీక్షిత పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


యాసిన్ మసీదు నుంచి శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మదర్సా విద్యార్థులు


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సీతంపేట : ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రవక్త మహమ్మద్ రసూలుల్లాహ్ జయంతి సందర్భంగా శాంతి ర్యాలీలు నిర్వహించారు. అక్కయ్యపాలెం, ముస్లిం తాటిచెట్లపాలెం, చిన్నూరు, పెద్దూరు ప్రాంతాల్లో వేడుక జరుపుకున్నారు. మసీదులు, దర్గాలలో ప్రార్థనలు చేసి శాంతి ర్యాలీ ద్వారా వన్‌టౌన్‌లోని హజ్రత్ ఇషాక్ మదినా ఔలియా దర్గాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అక్కయ్యపాలెం చిన్నూరు, పెద్దూరులో గల మసీదుల పెద్దల ఆధ్వర్యంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని యాసిన్ మసీదులోని మదర్సా విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు.

మర్రిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్ – ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఫజర్ నమాజ్ ఆచరించిన ముస్లింలు ఖురాన్ పఠించారు. చిన్నారులు పలు మసీదుల నుంచి శాంతి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కోట వీధి ఇషాక్ మదీనా వలి దర్గాకు చేరుకుని చాదర్ సమర్పించి దావత్ నిర్వహించారు. మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

వైభవంగా దుర్గా గణపతి తిరువీధి


ఉత్సవ మూర్తుల పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు


అలరించిన నవ దుర్గల నాట్యం

సీతంపేట : వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సీతంపేటలో గల దుర్గా గణపతి ఉత్సవ మూర్తుల తిరువీధి మహోత్సవం సోమవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. సిద్ధిబుద్ధి సమేత దుర్గా గణపతిని ప్రత్యేక అలంకరణలో మేళ తాళాలతో పల్లకీపై పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఆయన కుమార్తె శ్యామల దీపిక, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్, ఆలయ ఈవో జి.వి.రమాభాయి పల్లకీ మోసి తిరువీధి మహోత్సవాన్ని ప్రారంభించారు. స్థానికులు, భక్తులు, యువత పల్లకీ మోసేందుకు పోటీపడ్డారు. సీతంపేట కూడలిలో ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు గురుద్వారా, గొల్లవీధి, గణేష్‌నగర్, కనకమ్మ ఆలయం, రాధాకృష్ణ మందిరం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి హారతులతో దుర్గా గణపతికి నీరాజనాలు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వీటిలో సాము గరిడీలు, కోలాటం, తప్పెటగుళ్లు, తీన్‌మార్, నవ దుర్గల డ్యాన్సు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు ఊరేగింపులో పాల్గొని పల్లకీ వెంట నడిచారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాతీయ మీడియా సదస్సు విజయవంతం కావాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ, రామేశ్వరి

సీతమ్మధార : రాజస్థాన్‌లోని మౌంట్‌అబు పట్టణంలో నిర్వహించే జాతీయ మీడియా సదస్సు విజయవంతం కావాలని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ మేరకు బ్రహ్మకుమారీస్ సంస్థ విశాఖపట్నం మీడియా వింగ్ ఆధ్వర్యంలో సోమవారం బాలయ్యశాస్త్రి లే అవుట్ సింధూర అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా సెప్టెంబర్‌లో విశాఖ నుంచి పాత్రికేయుల బృందాన్ని తీసుకెళ్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థను ఆయన అభినందించారు. బ్రహ్మకుమారీస్ విశాఖ ప్రతినిధి రామేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30 వరకు మౌంట్‌అబూలో జాతీయ మీడియా సదస్సు జరుగుతుందన్నారు. విశాఖ నుంచి 32 మంది మీడియా ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారని గుర్తు చేశారు. అక్కడ పలు అంశాల మీద సెషన్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తారన్నారు. ఆఖరి రోజున బిల్వాడీ ఆలయ సందర్శన, సైట్‌సీయింగ్ వుంటాయన్నారు. సాయిరమేష్, సిద్ధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, భవాని, సత్యవతి, లావణ్య, పావని, రత్నకుమారి పాల్గొన్నారు.